క్లుప్తంగా

ఘనంగా కలశం ఆవిష్కరణ వేడుకలు



కలశంకు పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గామ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో కలశం ఆవిష్కరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా డొంగర్‌గామ్, భీంజితండా గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం సిర్పూర్(యూ)మండలంలోని కలశంకు ప్రత్యేక పూజల చేసి ఆవిష్కరించారు. ఆయా గ్రామాల భక్తులు కలశం ఆవిష్కరణ కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెందోర్ బాదుపటేల్, జాదవ్ హచ్చునాయక్, కోవ భీంరావ్, జావవ్ లింబాజీ, జాదవ్ దశరత్‌నాయక్, ఆర్క సెడ్మరావ్, జాదవ్ ధన్‌రాజ్, మడావి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న అభ్యర్థులతో ఎమ్మెల్యే

ఆదిలాబాద్: వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో గురువారం శిక్షణను పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పరిషత్‌కు అవసరమైన కంప్యూటర్లు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిషత్ నాయకులు జంగు, అజయ్, నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఇంద్రవెల్లి: ఎన్నికైన సభ్యులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఐకేపీ వీవోఏల నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఆలయంలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. మండల ఐకేపీ వీవోఏల జేఏసీ కమిటీ అధ్యక్షుడిగా షేక్ ఫెరోజ్, ప్రధాన కార్యదర్శిగా కొట్నాక్ భారిక్‌రావ్, ఉపాధ్యక్షురాలిగా గిరి మతుర, కోశాధికారిగా ఆత్రం నందిని, సభ్యులుగా జైపాల్, వినోద్, రాందాస్, జానకి, సునీత, జల్‌దేవి, విజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీవోఏల న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాడడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

గిన్నేర రాయిసెంటర్..

ఇంద్రవెల్లి: మండలంలోని గిన్నేర రాయిసెంటర్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం గిన్నేర రాయిసెంటర్ పరిధిలోని గ్రామాల పెద్దలు సమావేశమయ్యారు. గిన్నేర సార్‌మేడిగా మెస్రం దుర్గు, ఉప సార్‌మేడిలుగా కొడప శ్రీరాం, కుంర లక్ష్మణ్, గిత్తెదార్‌గా మడావి లక్కు, ఖజానదార్‌గా యేర్మ జంగు, సలహాదారుగా హెరేకుమ్ర రామరావ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేస్లాపూర్ రాయిసెంటర్ గిత్తెదారు కొట్నాక్ బారిక్‌రావ్, గ్రామపెద్దలు కొట్నాక్ దేవ్‌షావ్, మెస్రం ఆనంద్‌రావ్, కొరెంగా సుంగు, మెస్రం ఇస్తారి, మెస్రం భీంరావ్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో శబరిమాత ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శబరి మాత భక్తులు ఆడే గజేందర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు సేవలు ప్రారంభం

గుడిహత్నూర్: మండల కేంద్రంలో యూనియన్ బ్యాంకు బ్రాంచ్ సేవలను బ్యాంక్ డీజీఎం అరుణ సవిత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణస్థాయిలో మరింత వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇది ఆరోవ బ్రాంచ్‌గా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లకే పరిమితం

- తలమడుగు రైల్వేస్టేషన్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



తలమడుగు రైల్వేస్టేషన్

తలమడుగు: బోథ్ నియోజకవర్గంలో తలమడుగులో ఉన్న ఏకైక రైల్వేస్టేషన్ ఒకటి. రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైలుకే పరిమితమైంది. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల ప్రజల రవాణా సౌకర్యార్థం కోసం 1976లో ఏర్పాటు చేశారు. కానీ పాలకులు పట్టించుకోకపోవడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఉండం, కోసాయి గ్రామాల మీదుగా మహారాష్ట్రకు రైల్వేలైన్ ఏర్పాటు చేశారు. బోథ్ నియోజకవర్గంలో బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, గుడిహత్నూర్, సిరికొండ, భీంపూర్, తాంసి మండలాలు ఉన్నాయి. వాటిలో ఈ రైల్వేస్టేషన్ మాత్రం తాంసి, తలమడుగు మండలాల ప్రజల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేశారు. ఈస్టేషన్ మీదుగానే దీక్ష భూమి, పాట్నా, నాందేడ్, నందిగాం, కృష్ణ ఎక్స్‌ప్రెస్, శాంతగ్రంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్తుంటాయి. కేవలం ప్యాసింజర్ రైలు మాత్రమే ఇక్కడ ఆగుతాయి. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైల్లు ఆపాలని గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

మండల కేంద్రంలో రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగునీరు, కూర్చోవడానికి బెంచీలు లేవు. ఎండాకాలంలో ఎండలో ఎండుతూ వర్షాకాలంలో వర్షానికి తడిసి రైల్లో ప్రయాణం చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు (ఫైల్)

కనీసం మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంలో అధికారులు చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు ఇక్కడి నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లి ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో డబ్బులు, సమయం వృథా అవుతుంది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



రైల్వేస్టేషన్‌లో కేవలం ప్యాసింజర్ రైలు మాత్రమే ఆపుతున్నారు. మిగతా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపడం లేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇక్కడి నుంచి జిల్లా కేంద్రానికి అధిక చార్జీలు చెల్లించి వెళ్తున్నాం. దీంతో డబ్బులు, సమయం వృథా అవుతుంది. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా ఆపాలి.

– ఆనంద్, తలమడుగు

ఇప్పటికైనా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ చొరవ తీసుకొని తలమడుగులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

నెరవేరిన కార్యకర్తల చిరకాల స్వప్నం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లాలో బీజేపీ కార్యాలయం ఏర్పాటుతో కార్యకర్తల చిరకాల స్వప్నం నెరవేరిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో బీజేపీ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీకి సొంత భవనం ఉండాలని కార్యకర్తలు ఎన్నో సంవత్సరాలుగా కోరుకుంటున్నారన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో తప్పకుండా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, నాయకులు గందే కృష్ణ, గందే విజయ్, వేణుగోపాల్, ఆదినాథ్, జోగు రవి, సోమ రవి, కృష్ణ యాదవ్, ఆకుల ప్రవీణ్, దినేష్ మటోలియా, మయూర్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకుంటేనే చరిత్ర సృష్టించగలం..

చరిత్రను గురించి తెలుసుకుంటేనే చరిత్ర సృష్టించగలమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో వీర్ బాల్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ మాత, వీర్ బాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చరిత్రను కనుమరుగు చేసే విధంగా గత ప్రభుత్వాలు ప్రయత్నించాయని ఆరోపించారు. మత మార్పిడి చేస్తున్న వారిని ఎదిరించి వీర బాలురు అయిన బాబా అజిత్ సింగ్, బాబా జుఝర్ సింగ్, బాబా జొరావర్ సింగ్, బాబా ఫతేసింగ్‌లు తమ ప్రాణత్యాగం చేశారని కొనియాడారు.

కార్పొరేట్ వైద్యం కోసమే సీఎంఆర్ఎఫ్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకే సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని కుమారి గ్రామానికి చెందిన పి.రుక్మ బాయికి మంజూరైన రూ.22,500, పి.కాశీరామ్‌కు రూ.27వేలు, ఇచ్చోడ మండలంలోని సాత్‌నంబర్ గ్రామానికి చెందిన జాదవ్ కౌసల్యకు రూ.25,500, ఇచ్చోడ మండలంలోని ముఖ్రా(బి) గ్రామానికి చెందిన ముసిరబిలకు మంజూరైన రూ.19,500, నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన సాయిచరణ్ తేజ్‌కు రూ.18వేలు, జి.ప్రవీణ్‌కు రూ.18 వేలు, డి.సునీతకు రూ.24 వేలు, ఎస్.లక్ష్మికి రూ.20,500, ఆర్.రాజేశ్వర్‌కు రూ.27 వేల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, శ్రీకాంత్, చంద్రశేఖర్, రుక్మన్ సింగ్, శ్రీధర్ రెడ్డి, మారుతి, దేవేందర్ రెడ్డి, పండరీ, ప్రతాప్ పాల్గొన్నారు.

రిమ్స్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలోని వసతులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగుల ద్వారా ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రోగులకు వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మరిన్ని వసతులు కల్పించాలని కోరారు.

పత్తి ధర తగ్గించవద్దని వినతి

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పత్తి ధర తగ్గించడం సరికాదని యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రుపేష్‌రెడ్డి అన్నారు. గురువారం సీసీఐ జిల్లా జనరల్ మేనేజర్ ఆద్య మిశ్రాను పట్టణంలోని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత తగ్గుతుందనే ఉద్దేశ్యంతో భారతీయ పత్తి సంస్థ సెంట్రల్ ఇన్‌చార్జి ఆదేశాల ప్రకారం ఎనిమిది శాతం తేమతో మద్దతు ధర రూ.7471 రూపాయలుగా ఈ నెల 31 నుంచి చెల్లించాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. కానీ జిల్లాలోని బేల మండల కేంద్రంలోనీ వ్యవసాయ మార్కెట్ లో మాత్రం స్థానికంగా ఉన్న మార్కెట్ అధికారులతో పాటు సీసీఐ అధికారి కుమ్మక్కై గురువారం నుంచే తగ్గింపు ధరను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బుక కిరణ్, నగేశ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహాసభలు జయప్రదం చేయండి

ఎదులాపురం: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 2025 జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న సీపీఎం రాష్ట్ర నాల్గోవ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలు, భవిష్యత్ పోరాలపై చర్చించడం జరుగుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. ఏడాదిపాలనలో ఆరు గ్యారంటీల అమలు ఊసే లేదని, ప్రజా పోరాటాలపై నిర్బంధాలు విధిస్తూ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పూసం సచిన్, ఏరియా కమిటీ సభ్యులు స్వామి, గంగన్న, ఆత్రం కిష్టన్న, పోచక్క, వెంకన్న, గంగారాం, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకుడు

హక్కుల కోసం ఉద్యమిస్తాం

ఆదిలాబాద్‌రూరల్: అణగారిన వర్గాల ప్రజల హక్కులు, సమాజ చైతన్యం కోసం ఐక్యంగా ఉద్యమించనున్నట్లు అంబేడ్కర్ ఐక్య పోరాటాల సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహించారు. ఇటీవల అంబేద్కర్ వాదం, రాజ్యాంగం మీద జరుగుతున్నటువంటి దాడులను ఖండించారు. రాజ్యాంగం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేలా త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, నగేశ్, తుల్జాపూర్ శోభతాయి, నిమ్మల ప్రశాంత్, ఈర్ల దయాకర్, అగ్గిమల్ల గణేష్, కుమ్మరి సత్యనారాయణ, సూరం రాహుల్, సూరం భూమన్న, విటల్, ఊషన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూమన్న

బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయం

ఎదులాపురం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నత సీపీఐ ధ్యేయమని పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం పార్టీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సమ సమాజ స్థాపన కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఆదివాసీలు, వ్యవసాయ కూలీలు, కార్మికుల హక్కుల కోసం పోరుబాట నడుపుతుందన్నారు. వంద సంవత్సరాలుగా దేశ ప్రజలకు అండగా నిలబడుతూ వస్తోందన్నారు. దేశాన్ని దోచుకుంటున్న పెత్తందారులను తరిమికొట్టేందుకు సీపీఐ కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాదులు విజృంభిస్తున్నారని, వారిని తరిమికొట్టడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో కుంటాల రాములు, పట్టణ కార్యదర్శి ఎస్. అరుణ్ కుమార్, షేక్ బాషా, రమేశ్, పెద్దింటి సత్యనారాయణ, అమీనా ఖాన్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామంలో గురువారం ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఎడ్లబండిపై బాజీరావు బాబా చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంతతగా ఉండాలంటే ఆధ్యాత్మిక గురువులు సూచించిన సన్మార్గంలో నడాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శబరిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్, లక్ష్మారెడ్డి, చిలుకూరి వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, జ్ఞానేశ్వరి, గంగారెడ్డి, వెంకటేష్, భోజారెడ్డి, లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు

సన్మానం

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నూతన బీజేపీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రాహ్మనంద్‌తో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లను నేరడిగొండ మండల బీజేపీ అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ సన్మానించారు. గురువారం బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, మాజీ సర్పంచ్ జాదవ్ పరుశురాం, గట్టు నారాయణ, రాథోడ్ కమల్ సింగ్, నాయకులు గూడ రాజేందర్ రెడ్డిలు శాలువాతో సత్కరించారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల మావల మండలంలోని బట్టిసావర్‌గాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న గురువారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఇంద్రవెల్లి: మండలంలోని దుబ్బగూడ గ్రామానికి చెందిన శంకర్‌గూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ తుమ్రం లక్ష్మణ్ అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ గురువారం సాయంత్రం దుబ్బగూడ గ్రామానికి సందర్శించి పరామర్శించారు. లక్ష్మణ్ ఆరోగ్య పరిస్థితి ఆడిగి తెలుసుకున్నారు.

ఆడే గజేందర్‌ను కలిసిన సభ్యులు

నేరడిగొండ: బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామస్తులు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను మర్యాద పూర్వంగా కలిశారు. గురువారం నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. రెడ్డి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆడే గజేందర్ తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పెట్రోల్ ట్యాంకర్‌కు నిప్పు



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద గురువారం మధ్యాహ్నం పెట్రోల్ ట్యాంకర్‌కు నిప్పంటుకుంది. సమాచారం అందుకున్న ఎస్సై తిరుపతి, అగ్నిమాపక సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. రామగుండం నుంచి ఇచ్చోడలోని ఐటీడీఏ పెట్రోల్‌బంక్‌కు పెట్రోల్‌తో వస్తున్న ట్యాంకర్‌కు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. అప్రమత్తమైన ఎస్సై, సిబ్బంది వెంటనే మంటలార్పడంతో ప్రమాదం తప్పింది.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

తాంసి: గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని భీంపూర్ ఎస్సై కలీం అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని బెల్సరీ రాంపూర్ గ్రామంలో జైభజరంగ్ కబడ్డీ పోటీలను గ్రామస్తులతో కలిసి ఎస్సై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గిరిజన గ్రామంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంతోశ్, భీంపూర్ మాజీ సర్పంచ్ లింబాజీ, యువజన సంఘం సభ్యులు కేశవ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని వేణునగర్ కాలనీలో రూ. 34 లక్షలతో, అదే విధంగా లక్కారం గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖయ్యుం, ప్రభాకర్‌రెడ్డి, మర్సుకోల తిరుపతి, కలీం, నర్సయ్య, రజేశ్, రాజేశ్వర్, ఎక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

చదువు కోసం రూ. 50 వేల ఆర్థిక సాయం

దివంగత ఆదివాసీ ఉద్యమ నాయకుడు ఉయిక సంజీవ్ కుమార్తె చదువు కోసం రూ. 50 వేలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గురువారం అందజేశారు. ఉయిక సంజీవ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతా మాత్రంగానే ఉండడంతో కుమార్తె చదువు కోసం ఆర్థిక సాయం చేశారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని అమ్మాయికి సూచించారు.

ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం

- నిలిచిపోయిన సేవలు



ఎమ్మార్సీ కార్యాలయానికి వేసిన తాళం

ఇచ్చోడ: సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం పడింది, సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో విద్యాశాఖలో కీలకమైన పనులు నిలిచిపోయాయి. మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు, పాఠశాలల నిర్వహణకు చెందిన బిల్లులు, నిలిచిపోయాయి. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పాఠశాలలకు పంపించాల్సిన బియ్యం సరఫరా సైతం నిలిచిపోయింది.

సభను జయప్రదం చేయండి

ఎదులాపురం: హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న నిర్వహించనున్న రెండు న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటనారాయణ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. విప్లవకారుల ఐక్యత కోసం రెండు న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, శేషారావు, అఖిల్, ఎర్రాజి హరీశ్, దత్తు, సుంగు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు